ఏలూరు లాకులు, లెనిన్ సెంటర్, సత్యనారాయణపురం, దుర్గాపురం ప్రాంతాల మధ్య ఉన్న అలంకార్ సెంటర్ రణరంగంగా మారింది. నిర్బంధాలకు నిలయమైంది. పీఆర్సీ బకాయిల కోసం ధర్నా చేయడానికి వస్తున్న ఉపాధ్యాయులను పోలీసులు అడుగు ముందుకు వేయకుండా అడ్డుకున్నారు. అత్యవసర సేవల్లో లేని అంగన్వాడీలపై ఎస్మా ఎందుకంటూ జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించిన కార్మిక సంఘాల నేతలను అరెస్టు చేసి పోలీసు వాహనాల్లోకి ఎక్కించారు. ఒకపక్క నిరసనకారులు, మరోపక్క పోలీసుల అడ్డగింపులతో అలంకార్ సెంటర్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అలంకార్ కూడలికి ఉన్న ఐదు మార్గాలను పోలీసులు బారికేడ్లతో మూసివేశారు. వాటిని దాటుకుని వచ్చిన వారిని అటు నుంచి అటే వాహనాల్లోకి ఎక్కించారు.



బెజవాడలో ఉపాధ్యాయులను బలవంతంగా లాగుతున్న పోలీసులు

బెజవాడ రణరంగం

పోలీసు వలయంలో ధర్నాచౌక్ ప్రాంతాలు

- గురువులను ఎత్తేసిన లాఠీలు
- ఎక్కడికక్కడ ఉపాధ్యాయుల అరెస్టు
- ఎస్మాకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల జైల్‌భరో
- పలువురు నేతల అరెస్టు

విజయవాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పీఆర్సీ బకా యిలను చెల్లించడంతోపాటు జీఎల్ఐ నిధులను జమ చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో 36 గంటల ధర్నాకు పిలుపు నిచ్చింది. రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఈ ధర్నాకు ఉపాధ్యాయులంతా హాజరుకావాలని విజ్ఞప్తి చేసింది. ధర్నా కోసం యూటీఎఫ్ నేతల పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని తిరస్కరించిన పోలీసులు నిషేధాజ్ఞలు అమలు చేశారు. నిరసన తెలిపే హక్కు తమకు ఉందంటూ ఉపాధ్యాయులు నిషేధాజ్ఞలు దాటుకుని ముందుకు వచ్చారు. ఉత్తరాంధ్ర, ఉమ్మడి ఉభయగోదావరి, రాయలసీమ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కొంతమంది మంగళవారం ఉదయం రైళ్లు, బస్సుల్లో విజయవాడకు చేరుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చేవారు సోమవారం సాయంత్రమే చేరుకున్నారు.

అడుగేయకుండా అడ్డంకులు

ఐలాపురం హోటల్, శ్రీరామ ఫంక్షన్ హాలు, లెనిన్‌సెంటర్, సాంబమూర్తి రోడ్డు, దుర్గాపురం ప్రాంతాలను పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ మార్గాల నుంచి అలంకార్ వైపునకు వచ్చే అన్ని వాహనాలను వివిధ మార్గాల్లో మళ్లించారు. ఉపాధ్యాయులు గెరిల్లా టెక్నిక్ ఉపయోగిస్తారని గ్రహించిన పోలీసులు అందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. అలంకార్ సెంటర్ వైపు నుంచి జింఖానా గ్రౌండ్స్‌కు వెళ్లే అవకాశం ఉండడంతో బారికేడ్లతో మూసివేశారు. కొంతమంది ఉపాధ్యాయులు గుంపులుగుంపులుగా ఒక్కో మార్గం నుంచి అలంకార్ సెంటర్ దాటడానికి యత్నించారు. వారిని అక్కడిక్కడే అరెస్టు చేశారు. పీఎన్‌బీఎస్‌లో అన్ని ఫ్లాట్‌ఫామ్‌ల మీద పోలీసులు కనిపించారు. వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు వచ్చిన బస్సుల నుంచి దిగిన ప్రయాణికులను తనిఖీ చేశారు. దిగిన వారిలో ఎవరైనా ఉపాధ్యాయులుగా కనిపిస్తే అరెస్టు చేశారు. రైల్వేస్టేషన్‌లో ఇదే పంథాను అవలంబించారు. మొత్తం 300 మంది ఉపాధ్యాయులను పోలీసుల అరెస్టు చేశారు. వారిని అజిత్‌సింగ్ నగర్‌లోని షాదీఖానా, పప్పులమిల్లు సెంటర్‌లోని రైసుమిల్లు, నాడార్ కల్యాణ మండపంలో ఉంచారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అరెస్టుల పరంపర కొనసాగింది. అనంతరం పూచీకతుపై విడుదల చేశారు.

ఎస్మా ఎందుకు?

కొద్దిరోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ఉపయోగించడానికి సిద్ధమైన విషయం తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు రోడ్డు మీదకు వచ్చాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ వంటి కార్మిక సంఘాలు ఎస్మాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించాయి. లెనిన్ సెంటర్ నుంచి అలంకార్ సెంటర్ వైపునకు వచ్చిన వివిధ కార్మిక సంఘాల నేతలను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి బస్సుల్లో ఎక్కించారు. అటు ఉపాధ్యాయులు, ఇటు కార్మికులను అరెస్టులు చేయడంతో అలంకార్ సెంటర్ ప్రాంతమంతా వేడెక్కిపోయింది. కొంతమంది పోలీసుల అరెస్టుల నుంచి తప్పించుకోవడానికి సినిమా థియేటర్లలోకి వెళ్లారు. మరికొంతమంది ఇంద్రకీలాద్రికి వెళ్లి కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.



ఎస్మాను ఉపసంహరించాలని బందరులో కార్మిక సంఘాల నిరసన




నిరసనలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలను ఈడ్చేస్తున్న పోలీసులు

అంగన్వాడీల జైల్‌భరో

- అరెస్టుల పర్వం..
- కొనసాగిన రిలే దీక్షలు

- 6లో..



కె.పి.సారథి

సారథి స సేమిరా..!

ఎంపీ వద్దు.. ఎమ్మెల్యే వద్దు... వైసీపీ నుంచి పోటీకి విముఖత

అధికార పార్టీ తరపున టికెట్ ఇస్తామంటే కాదనే వారు ఉంటారా? కానీ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో సీన్ రివర్స్‌లో ఉంది. మైలవరం నుంచి సిటింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, పెనమలూరు నుంచి కొలుసు పార్థసారథి వైసీపీ తరపున పోటీ చేసేందుకు విముఖత చూపుతున్నారు. మరోవైపు టికెట్లు దక్కనివారు పార్టీమారే యోచనలో ఉండటంతో ఈ రెండు జిల్లాల్లో వైసీపీ పరిస్థితి ఏమిటో అంతుబట్టక పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు.

- వెలంపల్లి, మల్లాదికి తాడేపల్లి నుంచి పిలుపు
- గందరగోళంలో పార్టీ శ్రేణులు



వెలంపల్లి శ్రీనివాస్



మల్లాది విష్ణు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మొత్తం 12 మంది వైసీపీ ఎమ్మెల్యేలు ఉండగా వారిలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకి, తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావుకు టికెట్ లేదని పార్టీ పెద్దలు స్పష్టం చేశారు. మరోవైపు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వైసీపీ టికెట్‌పై పోటీకి విముఖత చూపుతున్నారు. మిగిలిన ఏడుగురిలో పలువురికి సీటు ఖాయమైనా స్థానచలనం ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లిని సెంట్రల్‌కు మార్చగా, పెడన ఎమ్మెల్యే జోగి రమేశ్‌ను మైలవరం కానీ పెనమలూరు కానీ తీసుకొస్తారన్న ప్రచారం జరుగుతోంది. విజయవాడ పశ్చిమ సీటును ఆసిఫ్‌కు కేటాయించినా చివరి నిమిషంలో మార్పులు ఉంటాయని తెలుస్తోంది. టీడీపీ నుంచి బయటకు వచ్చిన కేశినేని నానికి విజయవాడ ఎంపీ సీటుతోపాటు విజయవాడ పశ్చిమ నుంచి ఆయన కుమార్తె కేశినేని శ్వేతకు కేటాయిస్తారన్న ప్రచారం ఉంది.

అసంతృప్తులకు బుజ్జగింపులు

విజయవాడ సెంట్రల్ నుంచి వైసీపీ టికెట్ దక్కని సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్న సమాచారంతో తాడేపల్లి పెద్దలు అప్రమత్తమయ్యారు. మంగళవారం ఆయన్ను పిలిపించుకుని బుజ్జగించినట్టు తెలిసింది. వెలంపల్లి కూడా తాడేపల్లి వచ్చారు. సోమవారం నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు సోదరుడు అరుణ్‌ను పలిపించిన తాడేపల్లి పెద్దలు జగన్మోహనరావుకి ఈసారికి టికెట్ ఇవ్వడం లేదని చెప్పినట్టు సమాచారం. అందరినీ పిలిపించి మాట్లాడుతున్న వైసీపీ పెద్దలు తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి విషయంలో మాత్రం తమ పార్టీ వ్యక్తే కానట్టు వ్యవహరిస్తుం డటం చర్చనీయాంశంగా మారింది. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన రక్షణనిధి విషయంలో పార్టీ తీరు సరిగా లేదని ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐప్యాక్, జగన్ లెక్కలు కొలిక్కి వస్తే రెండు జిల్లాల నుంచి నలుగురైదుగురు కొత్త ముఖాలు అసెంబ్లీ బరిలో నిలిచే అవకాశం ఉంది. విజయవాడ పశ్చిమ నుంచి ఆసిఫ్ కానీ ఆ స్థానంలో మరొక కొత్త వ్యక్తి కానీ పోటీలో ఉండే అవకాశం ఉంది. పెడన నుంచి ఉప్పాల రాము, నందిగామ నుంచి అమర్లపూడి సౌజన్య వైసీపీ టికెట్ రేసులో ఉన్నారు. తిరువూరు నుంచి కొత్త అభ్యర్థి అన్వేషణ కొనసాగుతోంది.

వైసీపీ నాయకుల్లో అసహనం

పెనమలూరు నుంచి సారథికి ప్రత్యామ్నాయంగా వైసీపీ అభ్యర్థి లేరు. ఒకవేళ ఈ స్థానాన్ని జోగి రమేశ్‌కు ఇస్తే, మైలవరం నుంచి వసంత కృష్ణ ప్రసాద్ పోటీ చేయకపోతే మైలవరం నుంచి ప్రత్యామ్నాయ అభ్యర్థి లేరు. ఇక తిరువూరులోనూ అదే పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో అభ్యర్థుల మార్పు పేరుతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం సృష్టించడం ఏమిటని వైసీపీ నాయకులే అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కేంద్ర ఎన్నికల కమిషనర్‌తో మంగళవారం బెజవాడలో జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా



పెదపూడిలో బరికి సిద్ధం చేసిన పొలం

కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

» బరులు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

- 6లో..

14 నుంచి దుర్గగుడిలో సంక్రాంతి సంబరాలు

- 6లో..

దొడ్డిదోవన దోపిడీ!

అసలు రైళ్లు రద్దు చేసి.. స్పెషల్ రైళ్లు ఎత్తుగడ

- ప్రయాణికులను దోచుకునేందుకు రైల్వే కుతంత్రం
- ఈనెల 28 వరకు మెయింటినెన్స్ పనుల పేరుతో పలు రైళ్లు రద్దు

సంక్రాంతి ప్రత్యేక రైళ్ల ప్రకటన



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మెయింటినెన్స్ పేరుతో ఆరు నెలలుగా ఎడాపెడా రైళ్లను రద్దుచేస్తూ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న రైల్వే అధికారులు పండగ సీజన్‌లో కూడా ప్రయాణికులతో ఆడుకుంటున్నారు. పండగ సీజన్ అంతా పలు రైళ్లను రద్దు చేశారు. దాదాపుగా జనవరి 28వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేశారు. సంక్రాంతి సీజన్‌లో ఉన్న రైళ్లను రద్దు చేసిన రైల్వే అధికారులు.. సంక్రాంతి స్పెషల్ రైళ్లను వేయటం గమనార్హం. స్పెషల్ రైళ్లు నడపటానికి ప్రత్యేకంగా రైల్వే దగ్గర రిజర్వు రైళ్లు ఏమీ లేవు. అవే రైళ్లను రొటేషన్ చేయాలి. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ల కోసం ఇప్పటికే పెద్ద సంఖ్యలో రైళ్లను రద్దు చేస్తున్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ల కోసమే ఈ రైళ్లను రద్దు చేస్తున్నారన్నది బహిరంగ రహస్యం. సంక్రాంతికి స్పెషల్ రైళ్లను నడిపితే.. మళ్లీ వందేభారత్ రైళ్లకు ఇబ్బందిగా మారుతుంది. కనుక మరికొన్ని రైళ్లు రద్దు చేస్తే.. వాటి స్థానంలో స్పెషల్స్ నడుపుతున్నట్టుగా ప్రకటిస్తే సరిపోతుంది. పండగ రద్దీ కోసం రైల్వే అధికారులు స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్టుగా కూడా ఉంటుంది. పైగా సాధారణ రైళ్ల కంటే స్పెషల్ రైళ్లలో అదనపు చార్జీలు వసూలు చేసుకోవచ్చు. ఇది కూడా రైల్వేకు లాభం కలిగించే అంశమే. దీనిని దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు ముందస్తుగా వ్యూహాత్మకంగా పలు రైళ్లను మెయింటినెన్స్ పేరుతో రద్దు చేసినట్టు తెలుస్తోంది. బుధవారం విజయవాడ డివిజన్ పరిధిలో 8 రైళ్లను రద్దు చేశారు. మరో 8 రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. మొత్తం 11 రైళ్లను డైవర్షన్ చేశారు. అదే రోజున 30 సంక్రాంతి స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్టు ప్రకటించారు. రైళ్లను రద్దు చేసింది కొన్ని డివిజన్లలో అయితే.. సంక్రాంతి స్పెషల్ రైళ్లను మాత్రం మరికొన్ని డివిజన్ల నుంచి నడుపుతున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. అన్ని రైళ్లు కూడా పాసింగ్ అయ్యేది .. రద్దు చేసిన రైళ్ల స్టేషన్లలోనే. ఇలాంటపుడు సంక్రాంతి స్పెషల్ రైళ్లకు మెయింటినెన్స్ పనులు అడ్డురావా అన్నది రైల్వే అధికారులే చెప్పాలి. మెయింటినెన్స్ పనులకు అడ్డంకి రావటం లేదంటే .. అక్కడ అసలు మెయింటినెన్స్ పనులే జరగటంలేదన్నది అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రయాణికులను మభ్యపెట్టి ఈ సంక్రాంతి సీజన్‌లో రైల్వే అధికారులు ఆదాయాన్ని పిండుకోవటానికి సరికొత్త దందాకు శ్రీకారం చుట్టినట్టుగా అర్థమవుతోంది.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు



ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేయాలని ఆదేశాలు

> జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయే స్థితి ఏర్పడింది. సోమవారం నుంచి ఆన్‌లైన్‌లోనే ధాన్యం కొనుగోళ్లు చేయాలనే నిబంధన పెట్టడంతో రెండురోజులుగా జిల్లాలో కొనుగోలు ప్రక్రియ దాదాపు నిలిచిపోయింది. కొందరు మిల్లర్లు తెచ్చిన ఒత్తిడితో ఆన్‌లైన్‌లోనే ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించారని రైతులు వాపోతున్నారు. మంగళవారం జిల్లాలో 150 టన్నుల ధాన్యం కొనుగోళ్లు మాత్రమే నమోదయ్యాయి. రైతులు ఆపదలో ఉన్న సమయంలో ఆదుకోవాల్సిన అధికార యంత్రాంగం కొందరు మిల్లర్ల ఒత్తిడికి లొంగిపోయిందనే విమర్శలు వినవస్తున్నాయి.

- » రంగుమారిన ధాన్యం కొనుగోలులో నిబంధనల లొల్లి
- » ఇప్పటివరకు 2.98 లక్షల టన్నుల కొనుగోలు
- » గతనెల 21 నుంచి బిల్లులు పెండింగ్‌లోనే
- » తెరవెనుక చక్రం తిప్పిన మిల్లర్లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మిచౌంగ్ తుపాను కారణంగా కురిసిన భారీవర్షాలతో కోతదశలో ఉన్న, పనలపై ఉన్న పంట తడవడంతో నాణ్యత దెబ్బతింది. ధాన్యం రంగుమారింది. బియ్యం నూకలు అవుతున్నాయి. దీంతో రైతులు తమ వద్ద ఉన్న ధాన్యం శాంపిళ్లను నాలుగైదు మిల్లుల వద్దకు తీసుకువెళ్లి చూపుతున్నారు. ఏ మిల్లరు ధాన్యానికి ధర అధికంగా ఇస్తానంటే అక్కడ విక్రయిస్తున్నారు. నాణ్యత సక్రమంగా ఉంటే 75 కిలోల బస్తాకు రూ.1637 మద్దతు ధరగా చెల్లించాలి. వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినడంతో రైతులు మిల్లర్ల వద్దకు వెళితే మొలకలు వచ్చిన ధాన్యానికి రూ.1150 నుంచి రూ.1250 వరకు ధర చెల్లిస్తామని చెబుతున్నారు. నూకల శాతం అధికంగా ఉంటే మిల్లర్లు బస్తా ధాన్యానికి రూ.1300 ధరగా చెల్లిస్తామని చెబుతున్నారు. ఆఫ్‌లైన్‌లో ధాన్యం విక్రయాలు జరిపినా సంబంధిత వివరాలను నమోదుచేసి ధాన్యం బిల్లులు ఇచ్చేలా మిల్లర్లకు, రైతులకు మధ్య ఒప్పందం కుదురుతోంది. ధాన్యానికి ధర తక్కువగా చెల్లిస్తామని చెబుతున్న మిల్లులకు రైతులు ధాన్యం విక్రయించడంలేదు. ఈ పద్ధతి నచ్చని కొందరు పెద్ద మిల్లర్లు వారం రోజులుగా తెరవెనుక చక్రం తిప్పారు. ఆన్‌లైన్‌లో ధాన్యం విక్రయాలు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధుల ద్వారా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో సోమవారం నుంచి ఆన్‌లైన్‌లోనే ధాన్యం విక్రయాలు చేస్తామని అధికారులు ప్రకటించారు.

చక్రం తిప్పుతున్న పీఏసీఎస్ చైర్మన్లు

జిల్లాలో 317 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతోంది. ఇందులో 200కుపైగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. పీఏసీఎస్ అధ్యక్షులకు, మిల్లర్లకు మధ్య ఉన్న పరిచయం కారణంగా ఆన్‌లైన్‌లో కొన్ని మిల్లులకే ధాన్యం పంపుతున్నారు. ఉదాహరణకు కౌతవరం చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ధాన్యాన్ని గుడివాడలోని ఒక మిల్లుకే పంపుతున్నారు. ఆ మిల్లులో ధాన్యానికి సరైన మద్దతుధర రావడం లేదని, వేరే మిల్లుకు తమ ధాన్యాన్ని పంపాలని రైతులు కోరినా కౌతవరం ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది వినడం లేదు. ట్రాక్టరుకు రూ.3వేలు, లారీకి రూ.5వేల నుంచి రూ.10వేలు చొప్పున ఈ కొనుగోలు కేంద్రంలోని సిబ్బందికి పీఏసీఎస్ ప్రతినిధులకు కమీషన్ల రూపంలో మిల్లర్ల నుంచి వస్తుండంటంతో రైతుల ఇబ్బందులను వారు పట్టించుకోవడం లేదు. మిగిలిన పీఏసీఎస్‌లలోనూ ఇదే స్థితి నెలకొంది. కౌతవరానికి చెందిన ఒక రైతుకు సంబంధించిన లారీ ధాన్యం ఇటీవల గుడివాడలోని ఒక మిల్లుకు పంపారు. సదరు రైతును మిల్లు యజమాని పిలిపించి పూర్తిస్థాయి మద్దతు ధర చెల్లించాలంటే రూ.70వేలు కట్టాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో సంబంధిత రైతు తన ధాన్యం ఈ మిల్లుకు విక్రయించలేనని, నగదు చెల్లించనని ధాన్యాన్ని వెనక్కు తీసుకువెళతానని అడ్డం తిరిగారు. మిల్లరు రూ.20వేలు చెల్లిస్తే సరిపోతుందని చెప్పి, ఈ వ్యవహారం బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం గమనించదగ్గ అంశం.

75శాతం మంది ఆఫ్‌లైనే కోరుతున్నారు

రైతులు నేరుగా మిల్లర్లతో ధర మాట్లాడుకుని ధాన్యం విక్రయించేలా ఆఫ్‌లైన్ పద్ధతిని అమలు చేశాం. ఈ ఏడాది ప్రత్యేక పరిస్థితుల కారణంగా 75 శాతం మంది రైతులు ఆఫ్‌లైన్‌లోనే ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు రైతులకు ధాన్యం బిల్లులను రూ.390 కోట్లను చెల్లించారు.

-డి.రాజు, పౌరసరఫరాలసంస్థ జిల్లా మేనేజరు

కొన్నది 2.98 లక్షల టన్నులే..

జిల్లాలో 3.74 లక్షల ఎకరాల్లో గత ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు జరిగింది. 10.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాగా ఉంది. ఇప్పటివరకు జిల్లాలో ఆన్‌లైన్, లేదా ఆఫ్‌లైన్‌లో 2.98 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. పౌరసరఫరాలశాఖ ద్వారా 7.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. డిసెంబరు నెలంతా ఈనెల 8వ తేదీవరకు ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలుచేసి ఇప్పటికిపుడు ఆన్‌లైన్‌లో మాత్రమే కొనుగోలు చేస్తామని ఆంక్షలు పెట్టడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతనెల 21వతేదీ నుంచి ధాన్యం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, సంక్రాంతి పండుగకు ముందుగానే ధాన్యం బిల్లులు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



బందరులో బారికేడ్లను తోసుకుంటూ దూసుకువెళ్తున్న ఆందోళనకారులు

సీఎం..
జగన్ ఇచ్చిన హామీలు
అమలుచేయాలని అంగన్వాడీలు..
కనీస వేతనాలు పెంచాలని పారిశుధ్య
కార్మికులు.. పీఆర్సీ బకాయిల కోసం ఉపాధ్యా
యుల నిరసన కార్యక్రమాలతో కృష్ణా, ఎన్టీఆర్
జిల్లాల్లో ధర్నాచౌక్‌లు దద్దరిల్లాయి. ప్రభుత్వ బెదిరిం
పులకు తగ్గేదే లేదని ఉద్యమకారులు బారికేడ్లను
సైతం లెక్కచేయక ముందుకు కదిలారు. మరో
వైపు ఎస్మా ప్రయోగంతో ప్రభుత్వం ఉద్యోగులపై
ఉక్కుపాదం మోపగా భారీ సంఖ్యలో పోలీసు
బలగాలు మోహరించి ఎక్కడికక్కడ
ఉద్యమకారులను అరెస్టులు
చేశారు.



విజయవాడ ధర్నాచౌక్, పరిసర ప్రాంతాల్లో భారీగా మోహరించిన పోలీసులు

తగ్గేదే లే..

సీఎం స్పందించకపోవడం శోచనీయం

ధర్నాచౌక్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు మున్సిపల్ కార్మికులు విజయవాడ ధర్నాచౌక్‌లో చేపట్టిన ధర్నా 15వ రోజు కొనసాగింది. 'ఆప్కాస్ వద్దు, పర్మినెంట్ ముద్దు.. నగరమంతా నీళ్లు-మాకు కన్నీళ్లు.. నగరమంతా వెలుగులు-మాకు చీకటి' అంటూ కార్మికులు పెద్దఎత్తున నినదించారు. తమ డిమాండ్లు సాధించేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. గత ఎన్నికల ముందు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్ తన వాగ్దానాన్ని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య పనులు చేస్తు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నామన్నారు. 15 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నా సీఎం జగన్ స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు అధిక సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



ఆందోళనకారులను బలవంతంగా తరలిస్తున్న పోలీసులు

అంగన్వాడీల జైల్‌భరో..

- దద్దరిల్లిన కలెక్టరేట్.. అరెస్టుల పర్వం.. కొనసాగిన రిలే దీక్షలు

మచిలీపట్నం టౌన్, జనవరి 9 : జీతాలు పెంచాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం పెద్ద ఎత్తున జైల్ భరో కార్యక్రమం చేపట్టారు. తొలుత లక్ష్మీటాకీసు సెంటర్ వద్ద సంఘ నాయకులు రమాదేవి, రెజీనా రాణిలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీలో అంగన్వాడీ కార్యకర్తలతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సీపీఐ నాయకులు లింగం ఫిలిప్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ మతీన్, చంద్రశేఖర్, ఎస్.కుమారిలు పాల్గొన్నారు. ధర్నాచౌక్ వద్ద రిలే దీక్షలు జరుగుతుండగా, మరోవైపు ఆందోళనకారులు బారికేడ్లు తోసుకుంటూ కలెక్టరేట్ ముట్టడికి వెళ్లారు. ఆందోళనకారులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం దీక్షా శిబిరంలో సంఘ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా భయపడేది లేదని సంఘ నాయకులు పేర్కొన్నారు. నోటీసులిచ్చినా లెక్కచేయమని, ఉద్యమాన్ని కొనసాగిస్తామని అంగన్వాడీలు పేర్కొన్నారు.



- ఎస్మాకూ తలొగ్గని ఆందోళనకారులు.. ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమం
- నిరసనలతో దద్దరిల్లిన ధర్నాచౌక్.. ఎక్కడికక్కడ అరెస్టుల పర్వం

- బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరు
- అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం దుర్మార్గం
- సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింగరావు



ధర్నాచౌక్, జనవరి 9 : సీఎం జగన్ తమకిచ్చిన హామీలను అమలు చేయాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీ ఉద్యమానికి రాజకీయ రంగు పులమడం సరైందికాదని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ నర్సింగరావు హితవు పలికారు. అంగన్వాడీల రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా విజయవాడ ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఐదోరోజు మంగళవారం కొనసాగాయి. ఉద్యమం రాజకీయంగా జరుగుతోందని సజ్జల చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అంగన్వాడీల్లో పలు పార్టీలకు చెందినవారు ఉన్నారన్నారు. వైసీపీ నేతల కుటుంబాలకు చెందిన వారు కూడా ఉద్యమంలో పాల్గొంటున్నారన్నారు. కార్మికుల మధ్య చీలిక తెచ్చేందుకే ఈ వాఖ్యలు చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేదన్నారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది కార్మికుల హక్కులను కాలరాయడమేనన్నారు. ఇప్పటికైనా నోటీసులు ఇవ్వాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నేతలు పి.అజయ్‌కుమార్, యంవీ సుధాకర్, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్రనేత కృష్ణయ్యలు దీక్షకు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నేతలు బి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ, ఎన్‌సీహెచ్.సుప్రజ, టి.గజలక్ష్మీ, జైనీ రత్నకుమారి, లలితమ్మ, అధిక సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



మునేటిలో జలదీక్ష చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

నందిగామలో అంగన్వాడీల జలదీక్ష

నందిగామ : ఎస్మా ప్రయోగించినా, కేసులు బనాయించినా సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. మంగళవారం దీక్షా శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి మునేటిలో జలదీక్ష చేశారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చిన జగన్ నేడు తమ పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నాడన్నారు. ముఖ్యమంత్రికి బుద్ధి చెప్పి తీరుతామని హెచ్చరించారు. అంగన్వాడీలు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

నీకేమో రూ.400 కోట్లతో రుషికొండలో ప్యాలెస్.. రాష్ట్ర ప్రజల నెత్తిన రూ.13లక్షల కోట్ల అప్పు..

వేతనం రూ.వెయ్యి పెంచలేవా జగన్!

- కళ్లకు గంతలతో పారిశుధ్య కార్మికుల నిరసన.. సమ్మెకు నెట్టెం రఘురాం సంఘీభావం

జగ్గయ్యపేట, జనవరి 9 : రూ.400 కోట్లతో రుషికొండలో నివాసానికి ప్యాలెస్ కట్టుకుని, రూ.13లక్షల కోట్లు అప్పును రాష్ట్ర ప్రజల నెత్తిన వేసిన ముఖ్యమంత్రి జగన్‌కు పారిశుధ్య కార్మికులకు రూ. వెయ్యి జీతం పెంచేందుకు మనసు రాదా.. అని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం ప్రశ్నించారు. పథకాల పేరుతో ప్రజలకు చిల్లర పంచుతున్న జగన్‌రెడ్డి వేలకోట్లు తాడేపల్లి ప్యాలెస్‌లో నింపుకుంటున్నారని ఆరోపించారు. మంగళవారం జగ్గయ్యపేట ఎన్టీఆర్ సర్కిల్‌లో పురపాలకసంఘ పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బంది ఆందోళనకు సంఘీభావం తెలిపిన నెట్టెం వారితో పాటు కళ్లకు గంతలు కట్టి నిరసనలో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో జగన్ పారిశుధ్య కార్మికుల సేవలను ప్రశంసించి తాను వస్తే వేతనాలు పెంచుతానని నమ్మబలికి, ఐదేళ్లుగా మొహం చాటేయటం మోసకారితనం కాక మరేమిటని ప్రశ్నించారు. నిరుద్యోగులకు చంద్రబాబు నిరుద్యోగ భృతి కాదని, జాబ్ క్యాలెండర్‌తో ఉద్యోగాలు ఇస్తానని యువతను, సీపీఎస్ ఇస్తానని ఉద్యోగులను నమ్మించి మోసం చేసిన ఘనుడు జగన్ అని విమర్శించారు. త్వరలో చంద్రబాబు తిరిగి అధికారం చేపట్టి పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నెట్టెంతో పాటు నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి, మేకా వెంకటేశ్వర్లు, గింజుపల్లి రమేష్, గట్టిడి దుర్గాప్రసాద్, సంకా వెంకట్రావు, సూర్యదేవర రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేట ఎన్టీఆర్ సర్కిల్‌లో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న నెట్టెం, కార్మికులు

14 నుంచి దుర్గగుడిలో సంక్రాంతి సంబరాలు



వన్‌టౌన్, జనవరి 9 : సంక్రాంతి పండగను పురస్కరించుకుని దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో కేఎస్ రామారావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 14వ తేదీ భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము 5 గంటలకు కొండపై చిన్న రాజగోపురం వద్ద ఉన్న శ్రీ లక్ష్మీగణపతిస్వామి మందిరం వద్ద భోగిమంటలు, అనంతరం హరిదాసుల సంకీర్తన, బసవన్నల (గంగిరెద్దుల) విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మల్లిఖార్జున మహామండపం 7వ అంతస్తులో రాజగోపురం ఎదురుగా బొమ్మల కొలువు, సాయంత్రం 5.30 గంటలకు గొబ్బెమ్మలు, భోగిపళ్ల కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని అమ్మవారి ప్రధాన ఆలయం, ఉపాలయాలు, రాజగోపుర ప్రాంగణాలను శోభాయమానంగా ప్రత్యేక పూలతో అలంకారాలు, రంగవల్లులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. హిందూ సనాతన ధర్మం, తెలుగుదనం ఉట్టిపడేలా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

కృషి, క్రమశిక్షణతో ఎదిగిన వ్యక్తి చిరంజీవి



- వాల్తేరు వీరయ్య విజయోత్సవ సభలో బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జనవరి 9 : సినీహీరో చిరంజీవి కృషి, పట్టుదలతో, స్వయం శక్తితో ఎదిగిన గొప్ప వ్యక్తి, అభిమాన సంఘాలను సమాజ సేవా సంఘాలుగా మార్చిన నటుడు చిరంజీవి అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం అవనిగడ్డలో జరిగిన 'వాల్తేరు వీరయ్య' 365వ రోజుల విజయోత్సవ సభలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, వాల్తేరు వీరయ్య సినిమా అవనిగడ్డలో 365 రోజులు నిరంతరాయంగా ప్రదర్శించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ బాబీ, నిర్మాత యలమంచిలి రవి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా రామకృష్ణ థియేటర్‌లో సినిమా 365 రోజులపాటు ప్రదర్శించటం, ఇక్కడి ప్రజలకు చిరంజీవిపై ఉన్న అభిమానానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, జనసేన నేతలు గుడివాక శేషుబాబు, బచ్చు వెంకటనాథ్, చిరంజీవి అభిమాన సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ధైర్యం ఉంటే అడ్వకేట్ కమిషన్ వేయించు

- ఎమ్మెల్యే వసంతకు మాజీమంత్రి ఉమా సలహా



మైలవరం : నీ అవినీతి చిట్టా మొత్తం కోర్టుముందు, ప్రజల ముందు ఉంచుతా.. నీకు దమ్మూ ధైర్యం ఉంటే అడ్వకేట్ కమిషన్ వేయించు.. అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌కు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సలహా ఇచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఉమా విలేకర్లతో మాట్లాడుతూ, ప్రకృతి సంపద దోచుకున్న నువ్వు నాపై రూ.10 కోట్లకు పరువు నష్టం దావా వేస్తావా.. అని వసంతను సూటిగా ప్రశ్నించారు. మీ ముఖ్యమంత్రికి, మీ మంత్రులకే పరువు లేదు నేను క్షమాపణ చెప్పాలా అని ప్రశ్నించారు. పొదిలి రవిని బినామీ ఆస్తుల కోసం చంపలేదా అని ప్రశ్నించారు. పాపట్ల మేరీ బంధువులను తీసుకొస్తా ఒక అడ్వకేట్‌ను పెట్టి కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. పది రూపాయల నోట్లు చించి ఎన్నికల సమయంలో పంచి పెట్టాడని ఆరోపించారు. కొండపల్లి అడవి దోపిడీ నిజం కాదా అని నిలదీశారు. ఓటు ఆయుధంతో ప్రజలు నిన్ను ఎన్నికల్లో తరిమి కొడతారన్నారు. అన్ని విషయాలు కోర్టు ముందు ఆధారాలతో పెడతాం కోర్టులే సమాధానం చెబుతాయన్నారు.

చంద్రబాబు సభకు స్థల పరిశీలన



స్థల పరిశీలనలో వెనిగండ్ల , రావి

గుడివాడ : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు చేపట్టిన 'రా.. కదలిరా' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న భారీబహిరంగ సభకు చంద్రబాబు టూర్ కమిటీ సభ్యులు రవి యాదవ్, ఎమ్మెల్సీ సత్యనారాయణరాజులతో కలిసి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులు పరిశీలించారు. బంటుమిల్లి రోడ్డులోని అలంకృత ఫంక్షన్ హాల్ సమీపంలో, బందరు రోడ్డులో సిద్ధాంతం వద్ద, ఏఎస్ఆర్ కళాశాల సమీపంలో స్థలాలను పరిశీలించారు.

మోదీ పాలనలో శక్తివంతమైన దేశంగా భారత్

- కేంద్ర మంత్రి శ్రీపాద యశో నాయక్

గుడ్లవల్లేరు, జనవరి 9 : బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత భారత దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో స్థానానికి తీసుకువచ్చామని కేంద్ర పర్యాటక మంత్రి శ్రీపాద యశో నాయక్ అన్నారు. 2027 నాటికి భారత్ ప్రపంచంలోనే శక్తి వంతమైన దేశంగా ఎదగడానికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని మంత్రి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్వీఆర్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో 'వికసిత్ భారత్' సంకల్ప యాత్ర కార్యక్రమానికి కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో లక్ష ఉద్యోగాల బర్తీకి మోదీ కృషిచేస్తున్నారన్నారు. దేశంలో 80 కోట్ల మంది ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ పంపిణీ చేస్తోందన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా 10.08 కోట్ల ఇళ్లకు త్రాగునీరు కుళాయిల ద్వారా అందిస్తుందన్నారు. తొలుత వ్యవసాయ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు రూపొందించిన ప్రదర్శనలను మంత్రి పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కృష్ణా కలెక్టర్ పి.రాజబాబు, గుడివాడ ఆర్డీవో పద్మావతి, డీఈవో తహేరా సుల్తానా, వైద్య ఆరోగ్య శాఖాధికారి గీతాబాయి, తదితరులు పాల్గొన్నారు.



చిరుధాన్యాలతో అలంకరించిన పుష్పాకృతిని తిలకిస్తున్న కేంద్రమంత్రి

శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల (ఎస్.ఆర్.జి.ఇ.సి) కేంద్రమంత్రి శ్రీపాద యశోనాయక్ మంగళవారం సందర్శించారు. గ్రామీణ ప్రాంతంలో నాణ్యమైన విద్య అందించడం ముదావహమని మంత్రి అన్నారు. 25 సంవత్సరాలుగా కళాశాల యాజమాన్యం కృషిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రిని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.కోదండరామారావు, ఎం.ఆర్.సిహెచ్ శాస్త్రిలు సన్మానించి జ్ఞాపికను బహూకరించారు.

12న మోదీ, షా హఠావో-దేశ్ బచావో భారీ సభ

ధర్నాచౌక్, జనవరి 9: దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు బీజేపీ, దాని మిత్రపక్షాలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్లు వడ్డే శోభనాద్రీశ్వరరావు, కె.విజయరావులు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. "మోదీ, షా హఠావో- దేశ్ బచావో" నినాదంతో భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో భారీ సభను నిర్వహిస్తున్నామన్నారు. గాంధీనగర్ లోని ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ, దేశ సంపదను లూటీ చేసి ఆదానీ, అంబానీలకు కట్టబెడుతుందని విమర్శించారు. 12న జరిగే సభకు ఎస్‌కెఎం జాతీయ నాయకుడు రాకేష్ తికాయత్, ప్రముఖ సినీ నిర్మాతలు ఆర్.నారాయణ మూర్తి, తమ్మారెడ్డి భరద్వాజ్, సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత, ఏఐటీయూసీ జాతీయ నాయకురాలు వహిదా నిజాంలతో పాటు రాజకీయ, కార్మిక, రైతు, మహిళ, యువజన, విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, సామాజిక సంఘాల ప్రతినిధులు పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగిస్తారన్నారు. వేదిక రాష్ట్ర నేతలు జి.ఓబులేసు, వై.కేశవరావు, భాస్కర్‌రావు, రిటైర్డ్ ఐఏఎస్ బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వడ్డే తదితరులు

కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

- బరులు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు



పెదపూడిలో బరికి సిద్ధం చేసిన పొలం

కూచిపూడి/మోపిదేవి, జనవరి 9 : సంక్రాంతి పోరుకు కోడిపుంజులు సై అంటూ కాలు దువ్వుతున్నాయి. పందెపురాయుళ్లు ఇప్పటికే పొలాల్లో బరులు సిద్ధం చేసుకుంటున్నారు. పెదపూడి, కూచిపూడి గ్రామాల్లో ట్రాక్టర్లతో పొలాన్ని దున్ని యంత్రాలతో చదును చేస్తున్నారు. బరుల్లో పేకాట, మద్యం, గుండాట, చిత్తులాట, కాయ్ రాజా కాయ్, బిర్యానీ దుకాణాలను ఏర్పాటు చేసేందుకు ముందుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. లాడ్జిలన్నీ బరి నిర్వాహకులు బుక్ చేస్తున్నారు. ఈ ఏడాది రబీలో రెండో పంటగా మినుమును సైతం వదిలేసి రైతులు కోడిపందేల నిర్వాహకులకు లీజుకు ఇవ్వగా.. నిర్వాహకులు బరులను సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. ముందుగా క్రీడా పోటీలు నిర్వహించి అనంతరం పండగ మూడు రోజులు పెద్ద ఎత్తున కోడిపందాలతోపాటు పలు రకాల జూద క్రీడలు నిర్వహించేలా రంగం సిద్ధం చేస్తున్నారు. మండల కేంద్రమైన మోపిదేవి శివారు పెదప్రోలు గ్రామపంచాయతీ పరిధిలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో సంక్రాంతి సంబరాల పేరుతో కోడిపందేల నిర్వహణకు పొలం చదును చేసే పనులు మంగళవారం ప్రారంభించారు. అధికార వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు బరులు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సాంప్రదాయ చేతివృత్తుల ఆధారంగా జీవనం సాగించే వారు పీఎం విశ్వకర్మ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ఆర్.వెంకట్రావ్ అన్నారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ(ఎంఎస్ఎంఈ) జిల్లా పరిశ్రమల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ పథకం అమలుపై అవగాహన సదస్సును మంగళవారం జిల్లాపరిషత్ సమావేశపుహాలులో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వడ్రంగి, కుమ్మరి, స్వర్ణకారులు, సాంప్రదాయ బొమ్మల తయారీ, బుట్టలు, చాపలు అల్లడం, తాపీ పనివారు. పడవలు తయారు చేసేవారు శిల్పాలు, విగ్రహాలు తయారు చేయడం, చెప్పులు కుట్టేవారు, దర్జీలు, తదితర 18రకాల వృత్తుల వారికి పీఎం విశ్వకర్మ పథకం ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కులంతో సంబంధం లేకుండా సాంప్రదాయ వృత్తులు చేస్తూ కుటుంబాలను పోషించేకునే వారికి ఈ పథకం ద్వారా లబ్ధిచేకూర్చడం జరుగుతుందన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా, వార్డు సచివాయాల ద్వారా ఈ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, లీడ్‌బ్యాంక్ జిల్లా డిప్యూటీ మేనేజర్ మూర్తి, కామన్ సర్వీస్ సెంటర్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యా యత్నం!

- భార్య మృతి, భర్త పరిస్థితి విషమం



పాయకాపురం, జనవరి 9 : శాంతినగర్ ప్రాంతంలో అప్పుల బాధతో దంపతులు మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇరువురు పురుగుల మందు సేవించగా భార్య మృతి చెందింది. భర్త పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబటి ప్రతాప్‌కుమార్(35), అంబటి సాయి కన్య(32) భార్యాభర్తలు. వీరు గత కొంతకాలంగా శాంతినగర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త ఫ్లవర్ డెకొరేషన్ పనిచేస్తుండగా భార్య ఇంటి వద్ద చీటీల వ్యాపారం చేస్తుంది. మంగళవారం ఉదయం దంపతులు ఇద్దరూ ఇంట్లో అపస్మారక స్థితిలో పడిఉండటాన్ని గమనించిన వారి ఇద్దరు కుమార్తెలు ఇరుగుపొరుగు వారికి విషయం చెప్పారు. దీంతో స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే భార్య సాయికన్య మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. కాగా భర్త పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. చీట్ల వ్యాపారంలో అప్పులపాలైనట్టు పోలీసుల విచారణలో తేలింది. ఆ కారణంతోనే ఇరువురు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెలగలేరులో గోదాముల ప్రారంభం

జి.కొండూరు, జనవరి 9: వెలగలేరులో ఏఎంసీ మార్కెట్ యార్డ్ స్థలంలో రూ.10.91 కోట్లతో నూతనంగా నిర్మించిన గోదాములను మంగళవారం మంత్రి కాకాని గోవర్ధన రెడ్డి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈఈ వి.సురేంద్ర, డీఈఈ శ్యాం, ఏఈఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో డిజిటల్ సేవలు

గన్నవరం, జనవరి 9 : గ్రంథాలయాల్లో డిజిటల్ సేవలను అందించేందుకు విశేషకృషి చేస్తున్నామని ఆ సంస్థ చైర్మన్ టి.జమలపూర్ణమ్మ అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయానికి దాతలు ఇచ్చిన రెండు కంప్యూటర్‌లను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రంథాలయాల్లో పుస్తకాలతో పాటు కంప్యూటర్‌లు, జిరాక్స్ మిషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ గ్రంథాలయాల్లో ఉందన్నారు. దాతల సహకారంతో గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేసి పాఠకులకు అన్ని వసతులు సమకూరుస్తామని చెప్పారు. అభివృద్ధి కమిటీ సభ్యులు చిమట రామారావు, అవుటపల్లి పార్థసారథి, గ్రంథాలయ ఇన్‌చార్జి డి.బాబూరావు, కె.రాంబాబు, ఎం.రామచంద్రరాజు, బీడీసీ పి.కోటేశ్వరరావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఎస్మా దుర్మార్గం

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్


పెనమలూరులో జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీలో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జనవరి 9 : తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై సైకో జగన్‌రెడ్డి ప్రభు త్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించి వారిని లొంగదీసుకోవాలనుకోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ధ్వజమెత్తారు. మంగళవారం పెనమలూరు మహిళా మండలి కట్టపై జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన తనయుడు బోడె వెంకట్రాం, స్థానిక టీడీపీ నేతలతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు హామీలిచ్చిన ముఖ్యమంత్రి నాలుగేళ్లు దాటినా వారికిచ్చిన హామీలను నెరవేర్చకుండా సమ్మె చేస్తున్న వారిపై విపరీత చట్టాలను ప్రయోగించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో అంగన్వాడీలకు జీతాలు పెంచిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కిందన్నారు. గత్యంతరం లేకే సమ్మెబాట పట్టిన అంగన్వాడీల పట్ల ప్రభుత్వ అమానుషంగా వ్యవహరించటాన్ని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలని కోరారు. వివిధ రంగాల ఉద్యోగులకు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు టీడీపీ ప్రభుత్వ హయాంలో చేకూరిన ప్రయోజనాలను వివరించి వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నిలపాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, సంగెపు రంగారావు, చిగురుపాటి మల్లయ్య, తోటకూర ఉదయభాస్కర్, షేక్ సైదులు, సలీం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడిగడపలో బోడె హేమ ఆధ్వర్యంలో..

తాడిగడప 10, 11వడివిజన్లలో జరిగిన కార్యక్రమంలో బోడె సతీమణి బోడె హేమ స్థానిక నేతలతో కలిసి ప్రజలతో మాట్లాడారు. చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా, బోడె ప్రసాద్‌ను ఎమ్మెల్యేగా ఎన్నుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆమె వెంట మేడసాని రత్నకుమారి, రేఖ, నాగమణి, కనకదుర్గ, ప్రమీల, తుమ్మల రాంకుమార్, పీతా గోపీచంద్, మన్నె రాజా బాబు, నాగుల్ మీరా, మేడసాని వెంకటేశ్వరరావు, పామర్తి సిద్దయ్య, మొక్కపాటి దామోదర్, కందుల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబుతోనే రైతు రాజ్యం


సనత్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో దేవినేని గౌతమ్, స్మిత దంపతులు

కరువు కాలంలోనూ రాయలసీమలో చీనీ తోటలకు నీరందించిన మహానుభావుడు చంద్రబాబుతోనే రాష్ట్రంలో రైతురాజ్యం సాధ్యమని టీడీపీ నాయకులు దేవినేని గౌతమ్, స్మిత దంపతులు కొనియాడారు. మంగళవారం సనత్‌నగర్‌లో జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో వారు స్థానిక నాయకులతో కలిసి ప్రజలతో మాట్లాడారు. రాష్ట్రం ఎప్పుడు ఇబ్బందుల్లో ఉన్నా నేనున్నానంటూ రాష్ట్రాన్ని గాడిలో పెట్టిన చంద్రబును తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకొని రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. వారి వెంట స్థానిక నేతలు పాల్గొన్నారు.

ముస్తాబాద 89, 90వ బూత్‌ల్లో..

గన్నవరం : మండలంలోని ముస్తాబాద 89, 90వ బూత్‌లలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ, ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ ప్రధాన కార్యదర్శి మేడేపల్లి కాంతారావు, బూత్ ఇన్‌చార్జి కోనేరు రమామణి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఓట్లు ఉన్నాయో లేవో చూసుకోవాలన్నారు. ప్రభుత్వం కొందరి ఓట్లు తొలగించిందని అంటున్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయగలిగిన సత్తా చంద్రబాబుకే ఉందని, అందరూ ఆలోచన చేసి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని కోరారు. నారాయణ, కోనేరు వీరభద్రరావు, నాగమల్లేశ్వరి, బోడ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.


ముస్తాబాదలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు: సీఐ


స్వాధీనం చేసుకున్న కోడి కత్తులను చూపుతున్న సీఐ కనకారావు

గన్నవరం, జనవరి 9 : మండలంలో కోడి పందేలు, ఇతర జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ పి.కనకారావు హెచ్చరించారు. కేసరపల్లిలో కోడికత్తులు కట్టే రెడ్డి జగదీశ్వరరావును మంగళవారం అదుపులోకి తీసుకుని అతని దగ్గర ఉన్న కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ కనకారావు మాట్లాడుతూ, సంక్రాంతి పేరుతో గ్రామాల్లో అనధికారికంగా జూదాలు నిర్వహించటం నేరమన్నారు. గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, ఇతర జూదాలు నిర్వహిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ట్రైనీ డీఎస్పీ శ్రీవేద, ఎస్సైలు శ్రీనివాస్, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం

● విజిలెన్స్ దాడుల్లో రూ. 5,43,000 జరిమానా

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 9 : విద్యుత్ అక్రమంగా వినియోగిస్తూ చౌర్యం చేయడం నేరమని, చౌర్యం చేసిన వారిపై జరిమానాతో కూడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని విజిలెన్స్ ఎస్ఈ అల్ఫాన్స్ హెచ్చరించారు. మంగళవారం వీరవల్లి సెక్షన్ పరిధిలోని వేలేరు, రేమల్లె తదితర 10 గ్రామాల్లో విద్యుత్‌శాఖ సిబ్బంది బృందాలుగా ఏర్పడి గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఈ అల్ఫాన్స్, ఈఈ వెంకటేశ్వర్లు, ఆపరేషన్స్ డీఈ రామకృష్ణ, హనుమాన్‌జంక్షన్ డీఈ శ్రీనివాసరావు నేతృత్వంలో 47 బృందాలు 2,952 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో 173 సర్వీసుల్లో అదనపులోడు వాడుతున్నట్లు నిర్ధారించి రూ. 5,43,000 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిర్విఘ్నంగా సాగుతున్న చండీహోమం


హోమంలో పాల్గొన్న యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు

గన్నవరం, జనవరి 9 : గన్నవరం బస్టాండ్ సమీపంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు చేపట్టిన చండీహోమం నిర్విఘ్నంగా సాగుతుంది. మంగళవారం ఉదయం సుదర్శన యాగ పారాయణ చేశారు. 30 మంది ఋత్విక్కులు పాల్గొని వేద మంత్రాలతో యాగ పూజలు జరిపించారు. చండీయాగం, మహాలింగార్చన, మానపాశుపత, దత్తాత్రేయ మూలమంత్ర పఠనం చేశారు. సాయంత్రం శతచండి, లక్ష్మీ కమలాలయ యాగం నిర్వహించి, చతుర్వేద స్వప్న దర్శనంతో పూజలు ముగిశాయి. గత మూడు రోజులుగా చండీయాగం, సుదర్శనయాగ పారాయణ, సూర్య నామస్కారాలు చేయించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, టీడీపీ శ్రేణులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే అభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 9 : ప్రజల భాగస్వామ్యంతోనే దేశం అభివృద్ధి సాధించ గలదని పంచాయతీ కార్యదర్శి శ్యామ లరావు అన్నారు. వీరవల్లిలో మంగళవారం నిర్వహించిన జన్ భాగీదారీ (ప్రజా భాగస్వామ్యం) కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ప్రతి పౌరుడిలోని దేశభక్తి మనదేశానికి బలమని తెలుపుతూ భారత సంవిధాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పిల్లా రామారావు, కోడెబోయిన బాబీ, వీఆర్ఓ కోటేశ్వరరావు, నీలిమ, మహిళ పోలీస్ వాణి, సోనీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


బొమ్ములూరులో అయోధ్య అక్షింతలను అందజేస్తున్న గంగారత్నం

ప్రతి ఇంటికీ అయోధ్య రాముడి అక్షింతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 9 : అయోధ్య శ్రీరామజన్మభూమిలో మందిర నిర్మాణం, విగ్రహప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఇంటికీ అయోధ్య అక్షింతలను పంపిణీ చేయడం జరుగుతుందని సమరసత ఫౌండేషన్ కార్యదర్శి ఎదురువాడ శ్రీనివాసరావు తెలిపారు. బొమ్ములూరులో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామక్షేత్ర ట్రస్ట్ అక్షింతలను ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. గ్రామ ప్రధాన వీధుల్లో కోలాటం బృందం వెంట రాగా అక్షింతలను తలపై పెట్టుకుని మేళతాళాల మధ్య ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు, గ్రామ కన్వీనర్ మట్టా అచ్చయ్య, మహిళా కన్వీనర్ గంగారత్నం, సత్యనారాయణ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం నేడు

ఉయ్యూరు, జనవరి 9 : ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సలహాలు, సూచనల స్వీకరణలో భాగంగా బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కేఎస్ఆర్‌కె ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 995922 4796 సెల్ నంబరుకు ఫోన్‌చేసి ప్రయాణికులు సలహాలు, సూచనలు తెలపాలని కోరారు.

సైకో పాలన అంతా రివర్స్‌లోనే..

పెనమలూరు : సైకో ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి పాలన అంతా రివర్స్‌లోనే సాగుతోందని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు ఆరోపించారు. మంగళవారం కానూరు సనత్‌నగర్‌లో జరిగిన బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానికులతో మాట్లాడారు. అధికారం చేపట్టిన కొద్ది రోజుల్లోనే తొమ్మిది కోట్ల విలువైన ప్రజావేదికను కూల్చి జగన్ తన పైశాచికత్వాన్ని నిరూపించుకున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రాభివృద్ధికి సాయపడే వివిధ ప్రాజెక్టులను రివర్స్ టెండరింగ్ పేరుతో నాశనం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రజలు కళ్లతో చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రోడ్ల పరిస్థితి జగన్‌రెడ్డికి శాపంగా మారుతోందని పేర్కొన్నారు.

అభయాంజనేయస్వామికి

కేంద్ర సహాయ మంత్రి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, జనవరి 9 : కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్ మంగళవారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. గుడ్లవల్లేరులో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొని హనుమాన్‌జంక్షన్ మీదుగా విజయవాడ వైపు వెళ్లారు. మార్గమధ్యంలో అభయాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు నాగభూషణం మంత్రిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు అర్చనలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు చిరువోలు బుచ్చిరాజు, గుత్తికొండ రాజబాబు, శేషుకుమార్, సింగవరపు భాస్కర్ గణేష్ బాబు, మట్ల కబర్ధి, తోట మురళీధర్, నలగామరాజు తదితరులు పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న శ్రీపాద యశోనాయక్

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

కాటూరు(ఉయ్యూరు), జనవరి 9 : నేటి పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని రామకృష్ణ సేవాసమితికి చెందిన ప్రొఫెసర్ ఆర్ఓఎల్ శర్మ అన్నారు. కాటూరు సిద్ధార్థ స్కూల్‌లో ఉపాధ్యాయులకు మంగళవారం కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. 80మంది ఉపాధ్యాయులు సదస్సుకు హాజరు కాగా వీరికి కమ్యూనికేషన్ స్కిల్స్‌కు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రైవేట్ పాఠశాలల ఉయ్యూరు డివిజన్ అధ్యక్షుడు అర్జునరావు, మోహనరావు, సబ్బినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ శర్మ

జోసఫ్ తంబి బోధనలు అనుసరణీయం

తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్


దివ్యపూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్ ఆంథోని

ఉంగుటూరు, జనవరి 9 : బ్రదర్ జోసఫ్ తంబి చూపిన మార్గం, చేసిన దైవిక బోధనలు కతోలిక క్రైస్తవ బోధకులకు గొప్ప ఆదర్శమని తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ అన్నారు. పెదఅవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి మహోత్సవాలను పురస్కరించుకుని పుణ్యక్షేత్ర ప్రాంగణంలో జరుగుతున్న నవదిన ప్రార్థనలు మంగళవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. విజయవాడ జోసఫ్‌నగర్ విచారణ గురువులు రెవ.ఫాదర్ పెయ్యల ఆంథోని ప్రధాన యాజకులుగా హాజరై దివ్యపూజాబలిని సమర్పించారు. అనంతరం పాపసంకీర్తనం, అవశ్యకత, అనుగ్రహం అనే అంశంపై సందేశమిచ్చారు. ఈ సందర్భంగా పూజను సమర్పించిన ఫాదర్ అంతోనితోపాటు, జోసఫ్‌నగర విచారణ గురువులను బ్రదర్‌జోసఫ్ తంబి ఆశ్రమ గురువులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పూజాబలిని కొనియాడిన, తుట్టగుంట, వీరపనేనిగూడెం, మెట్లపల్లి సంఘస్థులకు తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 13నుంచి తంబి తిరునాళ్ల ప్రారంభమవుతున్న నేపథ్యంలో సంఘస్థులందరూ సహకరించి, అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక విచారణ గురువులు గోపు అభిలాష్, గోపు ప్రవీణ్, మద్దాల రవి, కచ్చా కిషోర్‌కుమార్, దిరిశం జయప్రసాద్, మరియదళ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఉయ్యూరు, జనవరి 9 : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరి ప్రాణాన్ని నిలబెట్టాలని, 18 నుంచి 60 ఏళ్ల లోపు ప్రతి ఒక్కరూ జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయ వచ్చని కళాశాల ప్రత్యేక అధికారి కె సత్యనారాయణ అన్నారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో మంగళవారం విజయవాడ రూరల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 111మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వి శ్రీరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె వేణుకుమార్, కార్యదర్శి శ్రీనివాస్, ఉయ్యూరు క్లబ్ అధ్యక్షుడు ఇస్మాయిల్, నూకల సాంబశివరావు, దినవహి ప్రసాద్, ఎన్ ఎస్ఎస్ ఆఫీసర్ కె శేఖర్, శ్రావణి, ఎన్‌సీసీ ఆఫీసర్ పి శ్రీరామ్ తదితరులు పర్యవేక్షించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ గుర్తింపు పత్రాలు అందజేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	174
చికెన్ స్కిన్‌లెస్	184

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.65

ముగ్గురు నకిలీ పోలీసుల అరెస్టు

పామర్రు : పోలీసులమంటూ మహిళను బెదిరించి డబ్బు డిమాండ్ చేసిన ముగ్గురిని పామర్రు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గతంలో పేకాట నిర్వహించి రెండేళ్ల కిందట మృతి చెందిన బసవయ్య భార్య విజయలక్ష్మిని సోమవారం రాత్రి నీవు కూడా పేకాట నిర్వహిస్తున్నట్లు తెలిసిందంటూ బెదిరించి ముగ్గురు వ్యక్తులు ఆమె వద్ద డబ్బు డిమాండ్ చేశారు. అనుమానంతో ఆమె పామర్రు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముగ్గురు వ్యక్తులను పామర్రు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నిందితులు మల్లంపల్లి శ్రీనివాసరావు (ఘంటసాల), వై.హరిప్రసాద్, లీలాకృష్ణ (పెదప్రోలు)గా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పెదలింగాలలో ప్రజలతో మాట్లాడుతున్న వెనిగండ్ల రాము


పాతరామన్నపేటలో కరపత్రాలు అందజేస్తున్న కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ


సీతాయిలంకలో కరపత్రాలు అందజేస్తున్న మండలి వెంకట్రామ్


వృద్ధురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న వర్ల కుమార్‌రాజా

చంద్రబాబు పాలనతోనే జీవితాలు బాగు

● టీడీపీ నేతలు వెనిగండ్ల, రావి, పిన్నమనేని ఉద్ఘాటన

నందివాడ, జనవరి 9 : ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం చేసింది శూన్యమని, రాష్ట్రం తిరోగమనంలో ఉందని నియోజకవర్గటీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు విమర్శించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి చంద్రబాబు పాలనే శరణ్యమన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం పెదలింగాల, చేదుర్తిపాడు గ్రామాల్లో మంగళవారం జరిగింది. వెనిగండ్ల మాట్లాడుతూ ప్రజలు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి, అరాచకం రాజ్యమేలుతున్నాయన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందుల పాల్జేసిందన్నారు. బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ కొడాలి నాని ప్రవర్తనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు. తొలుత పెద్దలింగాల, చిన్న లింగాల గ్రామాల ప్రజల కోరిక మేరకు వెనిగండ్ల రాము సొంత నిధులతో ఆత్కూరు యూటీ డ్రెయిన్ రేవును టీడీపీ నాయకులు ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి నంబూరి రాకేష్, సజ్జా రామారావు, తా తినేని మురళీ, నాని, కుంటం రాజు, సుబ్బారావు, చాట్రగడ్డ రవి పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్ :** రాష్ట్రాన్ని పాలించే సత్తా చంద్రబాబుకే ఉందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ అన్నారు. పాతరామన్నపేటలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను నీలిమ వివరించారు. ఉల్లింగిపాలెంలో డివిజన్ ఇన్‌చార్జి చింతా చిన్ని ఆధ్వర్యంలో 400 మంది పేద కుటుంబాలకు సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, నగర పార్టీ అధ్యక్షుడు ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, యశ్వంత్ వర్మ, వాటపల్లి రమేష్, కొక్కిలిగడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కుంచే, సాతులూరి నాంచారయ్య, జగన్ మోహనరావు, లుక్కా నాంచారయ్య, బీమవరపు పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** చంద్రబాబు ప్రకటించి సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ తెలిపారు. సీతాయిలంక వద్ద బాబు ష్యూరిటీ -భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన దాదాపు 130 పథకాలు కట్ చేసిన జగన్మోహన్‌రెడ్డిని కట్ చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ - జనసేన ఉమ్మడి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు మేలు సాధ్యమవుతుందని తెలిపారు. **గుడివాడ :** నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు సహకారంతో 11 వార్డులోని 78, 79, 80 బూత్‌ల పరిధిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ జబీన్, యూనిట్ ఇన్‌చార్జ్ కరీముల్లా, నాయకులు పట్టపు చిన్నా, పట్టపు శ్రీను, మస్తాన్, అలీం, మొబిన్, ఇషాక్, భాషా తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి గుంటూరు వినయ్‌బాబు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. బూత్ కన్వీనర్ నాగిడి రాంబాబు, నాగిడి శివ, నాగేశ్వరరావు, నాగిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **కూచిపూడి :** వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వర్ల కుమార్ రాజా విమర్శించారు. మంత్రిపాలెం శివారు మాకులవారిపాలెంలో మంగళవారం టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలసి బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించనున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, పార్టీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, వేమూరి రజనీకాంత్, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, పంది శ్రీనివాసరావు, గొంతుపులి వెంకటేశ్వరరావు, శ్యామ్, రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పామర్రు :** జగన్ సైకోపాలనతో విరక్తి చెందిన ప్రజలు టీడీపీ అధినేత చంద్రబాబుకు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్లకుమార్‌రాజా అన్నారు. అయ్యప్పనగర్‌లో మంగళవారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా ఎన్నికలమేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు దాలిపర్తి ప్రసాద్, మంతెన రామాంజనేయులు, పరసా సుబ్రమణ్యం పాల్గొన్నారు. నాయీబ్రహ్మణకాలనీలో అనారోగ్యంతో బాధపడుతు వెంకట రమణమ్మ(61)కు రూ.2500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. **కోడూరు :** అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డిఎస్సీ వేస్తానని చెప్పి నాలుగేళ్లు గడిచినా నోటిఫికేషన్ వేయ కపోవటం దారుణహని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. ఉల్లిపాలెం శివారు హరిపురం గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, గోగినేని సోమశేఖరరావు, బొలిశెట్టి విఠల్ రావు, గుడిసేవ సూర్యనారాయణ, బడే రాజబాబు, బొడ్డు వెంకన్న, తాత పోతురాజు, జన్ను గంగాధర్, పోలాబత్తన భీమారావు, మహమ్మద్ ఇమ్రాన్, బండే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


హరిపురంలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

కవిపురంలో సర్పంచ్ సహా 60 మంది టీడీపీలో చేరిక



పెడన రూరల్ : వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు విసుగు చెంది టీడీపీలో చేరుతున్నట్లు కవిపురం సర్పంచ్ పుప్పాల స్వరూపరాణి, ఆమె భర్త నీటి సంఘం మాజీ అధ్యక్షుడు పుప్పాల శ్రీరామమూర్తి తెలిపారు. పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ కాగిత కృష్ణప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు నేతృత్వంలో గ్రామానికి చెందిన వీరాంజనేయులు, వీర వెంక ట్రావు, కోటి నాంచారయ్య, కటకం సుబ్బారావు, అయ్యప్ప, నాగదనుంజయరావు తదితరులతో కలిసి 60మందిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికలలో టిడిపి, జనసేన నాయకత్వంలో ప్రభుత్వాన్ని గెలిపించుకుని జనరంజకమైన పాలనను ప్రజలకు అందించాలని స్వరూపారాణి అన్నారు. నూతనంగా పార్టీలోకి చేరేవారిని తెలుగుదేశం కండువాలతో స్వాగతం పలికారు. జడ్పీటిసి అర్జా నగేష్, శలపాటి వీర ప్రసాద్, శీరం ప్రసాద్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గొడుగుపేటలో టీడీపీ ఫ్లెక్సీలు చించివేత

మచిలీపట్నం టౌన్, జనవరి 9 : గొడుగుపేటలో టీడీపీ ఫ్లెక్సీలు, బ్యానర్లను వైసీపీ కార్యకర్తలు చించివేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. 39వ డివిజన్ ఇన్‌చార్జి కట్టా అంజిబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలను ఉద్దేశపూర్వకంగానే వైసీపీ కార్యకర్తలు చించివేశారంటూ పోలీసులకు కట్టా అంజిబాబు ఫిర్యాదు చేశారు. కార్యకర్తలు, అభిమానులు సంయమనం పాటించి పోలీసు వారికి సహకరించి నిందితులను గుర్తించే దిశగా అడుగులు వేద్దామని టీడీపీ కార్యకర్తలకు అంజిబాబు సూచించారు.


గుడివాడ విద్యావికాస్‌లో..


అవనిగడ్డ ఏవీఆర్ కళాశాలలో ముగ్గుల పోటీలు


కూచిపూడిలో చిన్నారి సైతం..


గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

రావులకొల్లుకు మాతృవియోగం



● వెంకట రమణమ్మకు వెనిగండ్ల నివాళి

గుడివాడ : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు మల్లేశ్వరరావు, ప్రముఖ సిద్ధాంతి రావులకొల్లు సుబ్రహ్మణ్యేశ్వరరావుల మాతృమూర్తి రావులకొల్లు వెంకట రమణమ్మ (80) మంగళవారం కన్నుమూశారు. ఆమె భౌతికకాయాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, వైసీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. రావులకొల్లు సోదరులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.


వెంకట రమణమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేత వెనిగండ్ల రాము

సంస్కృతిని చాటిన సంక్రాంతి సంబరాలు


బంటుమిల్లి కొమ్మారెడ్డి స్కూల్‌లో..


గుడ్లవల్లేరులో సత్యదేవునికి ముత్యాల హారతులు

కూచిపూడి : సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా పల్లెసీమలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. మహిళలు వాకిళ్లలో రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలు అలంకరించి సంస్కృతిని చాటుతున్నారు. తెల్లతెల్లవారక ముందే హరిలో రంగ హరి అంటూ హరిదాసులు కీర్తనలు ఆలపించి కానుకలు స్వీకరిస్తున్నారు. గంగిరెద్దుల విన్యాసాలు అలరిస్తున్నాయి. మహిళలంతా అరిసెలు, బూరెలు సిద్ధం చేస్తూ హడావిడి చేస్తున్నారు. కోడి పుంజులు పందేలకు సై అంటూ కాలు దువ్వుతున్నాయి. **మచిలీపట్నం టౌన్ :** కృష్ణావిశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సంప్రదాయ వస్త్రధారణతో జానపద నృత్యాలు చేశారు. రంగవల్లుల పోటీలు జరిగాయి. రసాయన శాస్త్ర విభాగాధిపతి రామశేఖరరెడ్డి, కె. పుష్పలత, ఎస్. రాంబాబు, టి. అనిల్‌కుమార్, జి. నరేష్‌బాబు, కె. సజని, ఎస్. సుధ పాల్గొన్నారు. **గుడివాడ :** విద్యావికాస్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. బైపాస్ రోడ్డులోని పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు ముప్పాళ్ల సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను చాటే సంక్రాంతి విశిష్టతను తెలిపారు. ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యాకమిటీ చైర్మన్ జి.సత్యవతి, ప్రధానోపాధ్యాయురాలు పిఎల్ నరసమాంబ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు అంబరా న్నంటాయి. డీవైఈవో వివి సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుండే సంస్కృతిసంప్రదాయాలు నేర్చుకోవాలన్నారు. ఎంఈవో త్రిపురసుందరీదేవి, ఎంపీపీ వెలివెల చినబాబు, డైరెక్టర్ కిషోర్ దంపతులు, ఉపాధ్యాయు లు, విద్యార్థులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** అవనిగడ్డలోని ఏవీఆర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. వర్షిత ప్రథమ, డి.అశ్విని ద్వితీయ, లక్ష్మీదుర్గ తృతీయ బహుమతి సాధించారు. ప్రిన్సిపాల్ ఎం.గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ నరసయ్య పర్యవేక్షించారు. **గుడ్లవల్లేరు :** ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ హైస్కూల్ లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల విచిత్ర వేషాలు అలరించాయి. ముఖ్యఅతిథిగా ఏఎన్నార్ కళాశాల విశ్రాంత గ్రంథాలయాధికారి పావులూరి శ్రీనివాస్, విశిష్ట అతిథిగా ప్రముఖ రచయిత్రి జి.రాధికారాణి విచ్చేయగా, హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, హెచ్ఎం. జి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ముత్యాల హారతులు - పిండి దీపాలు

గుడ్లవల్లేరు : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ముత్యాల హారతి వేడుక కన్నుల పండువగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** గీతామందిరంలో గోదా రంగనాథులకు మహిళలు పాల్గొని పిండి దీపాలను సమర్పించారు. తొలుత అర్చక స్వామి దీవి నరసింహమూర్తి పర్యవేక్షణలో అష్టోత్తర శతనామార్చన, కుంకుమ పూజలు జరిపారు. శ్రీదేవీ, స్వప్న, భవాని, మల్లికాంబ, అన్నపూర్ణ, లక్ష్మీతాయారమ్మలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **కోడూరు :** తూర్పు వైపు రామాలయం వద్ద ధనుర్మాస వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, మహిలు దీపాలను వెలిగించారు. **అవనిగడ్డ రూరల్ :** కొత్తూరు కోదండ రామాలయం వద్ద స్వర్ణ అన్నపూర్ణ ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాలను నిర్వహిస్తున్నారు. వికాస తరంగిణి సభ్యులు పూజలు చేసి హారతులిచ్చారు.



మొవ్వలో అంగన్వాడీల పొర్లుదండాలు

కూచిపూడి : మొవ్వలో అంగన్వాడీలు 29వ రోజైన మంగళవారం పొర్లు దండాలతో నిరసన తెలిపారు. ఎస్మాకు, నోటీసులకు భయపడేది లేదని, తమ సత్తా చాటుతామని నినదించారు. మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల మండలాలకు కార్యకర్తలు, సహాయకులు దీక్షలో పాల్గొన్నారు. సీఐటీయూ, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. **పామర్రు :** అంగన్వాడీల సమ్మె మంగళవారం 29వ రోజుకు చేరింది. అంగన్వాడీల సంఘం నేత కొడాలి ఉమారాణి, ప్రాజెక్టు నాయకులు కైలే రత్నశ్రీ, బొమ్మారెడ్డి పద్మ, వాణి, స్వర్ణలత, రాజేశ్వరి, సీఐటీయూ నేతలు ఒడుగు గంగాధర్, ఎం.విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

21వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షలు

మచిలీపట్నం టౌన్ : సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె 21 వరోజుకు చేరుకుంది. శిబిరాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి లింగం ఫిలిప్, కౌలుదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాగంటి హరిబాబు తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు పోతురాజు, ఎస్టీయు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

నాగాయలంక : పెదపాలెంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. షేక్ హుస్సేన్ షరీఫ్‌పై బొడ్డ అర్జునరావు, ఆయన కుమారుడు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. పెదపాలెం చిన్న లాకుల వద్ద ఎస్సై సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో నిందితులను అరెస్టు చేసి కత్తిని స్వాధీనపర్చుకున్నారు.



కొట్టి రామారావుకు ఘననివాళి

మచిలీపట్నం టౌన్ : కొట్టి రామారావు తెలు గు సాహిత్యానికి అందించిన సేవలు అజరామరమని సాహితీవేత్తలు పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉచిత బాలికల హాస్టల్‌లో మంగళవారం ప్రముఖ కవి కొట్టి రామారావు 90వ జయంతిని నిర్వహించారు. ఆయన కుమారుడు కొట్టి శ్రీరామ్ హాస్టల్ విద్యార్థులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. దిట్టకవి వెంకటేశ్వరరావు, లంకిశెట్టి బాలాజీ, కొట్టె వెంకట్రావు, కె. రామ్మోహనరావు, రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్ ప్రసంగించారు. ప్రముఖ గాయనీ కాశీపట్నపు ఉమ, కె.పావనిల ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులు నృత్య ప్రదర్శన నిర్వహించారు.

హుండీ ఆదాయం రూ.1.58 లక్షలు

నాగాయలంక : గణపేశ్వరం దుర్గా గణపేశ్వరస్వామి ఆలయం హుండీలను మంగళవారం లెక్కించారు. సంవత్సర కాలానికి రూ. 1,58,068 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సుధాకర్ తెలిపారు. ఆలయ ధర్మకర్త మండల రాంబాబు, అర్చకులు పోతుకూచి సత్యనారాయణ శర్మ పర్యవేక్షించారు.

భారీ అన్నసమారాధన 12న

పెడన : పైడమ్మ దేవస్థానం ఆవరణలో ఈనెల 12న భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఈవో టి.వి.వి. మోహనరావు తెలిపారు. జాతర ముగింపు సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.



జూదం వద్దు...క్రీడలు ముద్దు

తోట్లవల్లూరు : యువత జూదాల వైపు వెళ్లకుండా భవిష్యత్తుకు ఉపయోగపడే సంప్రదాయ క్రీడలను అలవర్చుకోవాలనీ సీఐ కిషోర్‌బాబు కోరారు. తోట్లవల్లూరు జడ్పీ హైస్కూ ల్లో మంగళవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో వాలీబాల్ పోటీలను సీఐ ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో క్రీడాకారులతో కలిసి వాలీబాల్‌ను ఆడి ఉత్సాహపరిచారు. గ్రామ సర్పంచ్ పెనుముత్స రాధిక, ఎస్సై విశ్వనాథ్, ఈడ్పుగంటి రూబేన్, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తోనే సాధ్యం

మచిలీపట్నం టౌన్ : గ్రామాల్లో సాగు, తాగునీరందించే సత్తా టీడీపీ, జనసేన కూటమికే ఉందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ అన్నారు. బందరు మండలం మంగినపూడి గ్రామంలో మంగళవారం రాత్రి పర్యటించారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, వైసీపీ పాలనలో రోడ్లకు మరమ్మతులు లేకుండా పోయాయన్నారు. టీడీపీ నాయకులు మెండు భానుమూర్తి, గమ్మిడి రాజు, శ్రీపతి వాకలరావు, జనసేన నాయకులు గడ్డం రాజు, వంపుగడల చౌదరి, రమేష్, సిహెచ్. సత్యనారాయణ, మనోజ్, పోతురాజు, ప్రవీణ్, గోవింద్, మోకా రవి, జన్ను నాగరాజు తదితరులు పాల్గొన్నారు.